సాక్షి నిజామాబాద్

మంగళవారం । 13 । ఫిబ్రవరి । 2024



నిబంధనలు పాటించాలి

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ సూచించారు.

- 8లో ▸



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

34.0 /20.7

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

21 నుంచి పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ రెగ్యులర్ సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 21 నుంచి ప్రారంభం అవుతాయని కంట్రోలర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి ప్రారంభం కావాల్సిన సెమిస్టర్ పరీక్షలను విద్యార్థుల కోరిక మేరకు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఆర్థిక వనరులను పెంపొందించుకోవాలి



రెంజల్: వారాంతపు సంతలతో పాటు రోజూ వారి మార్కెట్ ద్వారా గ్రామ పంచాయతీలు ఆర్థిక వనరులను పెంపొందించుకునాలని నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ చింతల సుశీల సూచించారు. మండలంలోని సాటాపూర్ మార్కెట్‌లో నాబార్డ్ నిధులు రూ.16.69 లక్షలతో నిర్మించిన రెండు షెడ్లు, అంగడి కార్యాలయం, బాత్‌రూంలను ఆమె సోమవారం ప్రారంభించారు. సాటాపూర్‌లో జరిగే వారసంత వివరాలను తెలుసుకున్నారు. వ్యాపారులు, కొనుగోలుదారులు నష్టపోకుండా షెడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. మార్కెట్‌లలో వసతులను ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణలోనే పేరుగాంచిన సాటాపూర్ పశువుల, కూరగాయల సంతను అభివృద్ధి చేసేందుకు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ విజయ, మాజీ ఎంపీపీ మొబిన్‌ఖాన్, మాజీ సర్పంచ్‌లు ఎఖార్‌పాష, జావీద్, ఎంపీవో గౌస్, నాబార్డ్ ఏజీ ఎం శ్రీనివాస్, జీడిఎం ప్రవీణ్‌కుమార్, గంగాధర్‌రావు, కార్యదర్శి మహబూబ్‌అలీ పాల్గొన్నారు.

'ఎస్‌డీఎఫ్'కు ఇన్‌చార్జి మంత్రి ఆమోదం తప్పనిసరి

మోర్తాడ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి కేటాయించిన స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్‌డీఎఫ్)ను జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతోనే ఖర్చు చేయాలని నిర్దేశించారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలను స్వీకరించిన అనంతరం ప్రతి నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున ఎస్‌డీఎఫ్ నిధులను మంజూరు చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు లేని చోట పార్టీ ఇన్‌చార్జీల ద్వారా ప్రతిపాదనలను సేకరించి ఇన్‌చార్జి మంత్రి ఆమోదం పొందేలా చర్యలు తీసుకుంటున్నారు. కాంగ్రెస్ గెలవని మూడు నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జిలకు బాధ్యత ఇచ్చి వారి ద్వారా అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కోసం తీసుకునే చర్యల గురించి ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. జిల్లాకు రూ.50 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులను మంజూరు చేశారు. జిల్లాలోని బాన్సువాడ నియోజకవర్గంలోని మండలాల్లో పనుల కోసం కామారెడ్డి జిల్లా ద్వారా నిధులను కేటాయిస్తారా లేక మన జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుందా అనేది తేలాల్సి ఉంది. ఇప్పటికే ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టబోయే పనుల కోసం గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌ల తీర్మానాలను అధికార పార్టీ నాయకులు తీసుకుంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలకు నిధుల ను వినియోగించే అవకాశం ఇవ్వకుండా ఇన్‌చార్జి మంత్రి ద్వారానే పనులకు సాంకేతిక ఆమోదం తెలుపడం, నిధులను తమకు న చ్చిన పనులకు కేటాయించి ఖర్చు చేయడం జరిగింది. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితులే పునరావృతం కావడం గమనార్హం.

మారణాయుధాలు స్వాధీనం



గాంధారి: అటవీజంతులను వేటాడుతున్న వ్యక్తి ఇంటిపై పోలీసులు దాడిచేసి రెండు నాటు తుపాకులు, నాటుబాంబులు, మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని రాంపూర్‌గడ్డ తండాకు చెందిన వల్లపు హన్మంతు అలియాస్ ఒడ్డె హన్మంతు కొంత కాలంగా అటవీజంతువులను వేటాడుతున్నాడని అటవీశాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సోమవారం హన్మంతు ఇంట్లో తనిఖీలు చేయగా, నాటుతుపాకులు, బాంబులతో పాటు మారణాయుధాలు లభించాయి. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

మాకేదీ గుర్తింపు?

- పదేళ్ల పాటు పార్టీ కోసం కష్టపడ్డాం
- ఇతర పార్టీల వారిని చేర్చుకొని అన్యాయం చేయొద్దు
- కిందిస్థాయి నాయకత్వాన్ని ప్రోత్సహించాలంటున్న కాంగ్రెస్ శ్రేణులు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పదేళ్ల పాటు కేసులకు భయపడకుండా పార్టీని కాపాడుకున్న తమకు గుర్తింపు దక్కడం లేదని కిందిస్థాయి కాంగ్రెస్ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ కోసం పనిచేసిన తమను కాదని.. అధికారంలోకి రాగానే కండువా కప్పుకున్న వారిని అందలమెక్కిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఏమాత్రం గుర్తింపు దక్కకుండా కొందరు నాయకులు అడ్డుపడుతున్నారని కాంగ్రెస్ గ్రామ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు వాపోతున్నారు. కొందరు నాయకులు ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకత్వాన్ని ఏమాత్రం ప్రోత్సహించకుండా అంతా తామే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరుసగా పదేళ్ల పాటు అధికారం లేకున్నా.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంత అణగదొక్కినా.. కేసులు పెట్టి వేధింపులకు గురిచేసినా.. ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ పార్టీని అధికారంలోకి తేవాలనే లక్ష్యంతో ముందుకు సాగామని కార్యకర్తలు చెబుతున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌ను నామరూపాల్లేకుండా చేసేందుకు ప్రయత్నించినప్పటికీ అహర్నిషలు కష్టపడ్డామని సదరు కార్యకర్తలు అంటున్నారు. తాము పార్టీ కోసం ఇంత కష్టపడితే అధికారంలోకి వచ్చిన వెంటనే బీఆర్‌ఎస్ నుంచి పలువురు కార్యకర్తలను, నాయకులను చేర్చుకునేందుకు కొందరు నాయకులు ఉత్సాహం చూపుతున్నారని సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు గుర్తింపు ఇవ్వకపోగా ఇలా ఇష్టం వచ్చినట్లు చేరికలను ప్రోత్సహించేందుకు ప్రయత్నించడం మానుకోవాలని కోరుతున్నారు. అధికారం ఉన్న సమయంలో బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలను ఇబ్బందులు పెట్టారని.. ఇప్పుడు వారే కాంగ్రెస్‌లో చేరేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొంటున్నారు. అలాంటి వారి విషయంలో గ్రామ, మండల స్థాయి నాయకులను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. ఏకపక్షంగా చేరికలను ప్రోత్సహిస్తే గ్రూపులు పెరిగి పార్టీ దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందని చెబుతున్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో నష్టం జరిగే అవకాశం!

బీఆర్‌ఎస్ నుంచి చేరికలను ప్రోత్సహిస్తే కాంగ్రెస్‌కు లాభం జరగకపోగా నష్టం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పార్టీ శ్రేణులు అంటున్నాయి. గ్రూపులు పెరిగి నిబద్ధత కలిగిన కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని, దీంతో చివరకు పార్టీ సైతం అభాసుపాలవుతుందని చెబుతున్నారు. శాసనసభ ఎన్నికల సమయంలో సైతం పార్టీలో కోవర్టుల కారణంగా అనేక ఇబ్బందులు పడ్డామని వాపోతున్నారు. కోవర్టులకు చెక్ పెట్టడంతో పాటు, బయట పార్టీల నుంచి వచ్చే నాయకులను, కార్యకర్తలను చేర్చుకోకుండా ఉంటేనే ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేసే అవకాశముంటుందని అంటున్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత ఇవ్వాలి

ఏళ్ల తరబడి పార్టీ కోసం పాటుపడిన తమకు స్థానిక సంస్థల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరుతున్నారు. పార్టీ భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకత్వాన్ని ప్రోత్సహించాలని డిమాండ్ చేస్తున్నారు. పార్టీ కోసం పాటుపడిన శ్రేణులకు ఈ మేరకు భరోసా కల్పిస్తేనే మంచి ఫలితాలుంటాయని, లోక్‌సభ ఎన్నికల్లో సైతం మంచి ఫలితాలుంటాయని అంటున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో సైతం యువ అభ్యర్థికి అవకాశం కల్పిస్తేనే మేలు కలుగుతుందని చెబుతున్నారు. బీజేపీ ప్రాబల్యం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో యువ నాయకత్వాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని కోరుతున్నారు.

ప్రజల ముంగిట్లోకి కేంద్ర పథకాలు



మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

- వికసిత్ భారత్‌కు విశేష స్పందన
- ఎంపీ అర్వింద్ ధర్మపురి

సుభాష్‌నగర్: కేంద్ర ప్రభుత్వం వివిధ వర్గాల అభ్యున్నతి కోసం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ద్వారా ప్రజల ముంగిట్లోకి తీసుకొచ్చామని ఎంపీ ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గాయత్రినగర్‌లో సోమవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర–2కు ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అర్హులు కేంద్ర పథకాలపై అవగాహన పెంచుకొవాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' నిర్వహిస్తోందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తున్నదన్నారు. అర్హులందరికీ ప్రయోజనం చేకూరుతున్నదని, పథకాల లబ్ధికోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వికసిత్ భారత్‌సంకల్ప యాత్రలో అధికారులకు నేరుగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారు తమ అనుభవాలను సభలో వివరించారు. కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. వివిధ పథకాలకు అధికారులను దరఖాస్తులను స్వీకరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, క్యాలెండర్లను ఆవిష్కరించారు. అనంతరం స్థానికులతో సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. వైద్యశిబిరంలో స్థానికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అంతకు ముందు పీఎం ఉజ్వల స్కీం కింద దరఖాస్తు చేసుకున్న వారికి అక్కడికక్కడే గ్యాస్ కనెక్షన్‌తో పాటు మంజూరు లెటర్లు, గ్యాస్ సిలిండర్లను ఎంపీ అందజేశారు. సీబీసీ ఎఫ్‌పీవో ధర్మానాయక్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రావు, కార్పొరేటర్లు సుమిత్ర కిశోర్, మల్లేశ్‌యాదవ్, నారాయణ, ది న్యూ ఇండియా ఇన్సురెన్స్ సీనియర్ డివిజనల్ మేనేజర్ శ్యామసుందరి, మున్సిపాలిటీ మేనేజర్ రమేశ్, కెనరా బ్యాంక్ మేనేజర్ శివచరణ్, అధికారులు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పీజీటీలో 12వ ర్యాంక్



ఇందల్వాయి: గురుకుల పీజీటీ మ్యాథమెటిక్స్ ఉపాధ్యాయ నియామక పరీక్షలో మండలంలోని లోలం గ్రామానికి చెందిన మచ్చ వినోద్‌కుమార్ రాష్ట్రస్థాయిలో 12వ ర్యాంకు, మల్టీజోన్ పరిధిలో 5వ ర్యాంకు సాధించాడు. గత సెప్టెంబర్‌లో జరిగిన నియామక పరీక్షల ఫలితాలు ఇటీవల వెలువడ్డాయి. వినోద్‌కుమార్ ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్, ఎంఏ తెలుగు, ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్, బీఈడీ కూడా పూర్తి చేశాడు. నియామక ప్రక్రియలో భాగంగా ఆదివారం జరిగిన ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైనట్లు వినోద్‌కుమార్ తెలిపారు.

పలువురు అధికారుల బదిలీ

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పలువురు అధికారులను సోమవారం ప్రభుత్వం బదిలీ చేసింది. మూడేళ్లకు పైబడి విధులు నిర్వర్తిస్తున్న అధికారులకు స్థానచలనం కలిగింది. దీనిలో భాగంగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చిత్రామిశ్రా బదిలీ అయ్యారు. ఆమెను ఏటూరు నాగారం ఐటీడీఏ పీవోగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో అక్కడ పనిచేస్తున్న అంకిత్ జిల్లాకు రానున్నారు.

డీపీవో జయసుధ..

జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) జయసుధను వికారాబాద్‌కు బదిలీ చేస్తూ ప్రభు త్వం సోమవారం ఉత్తర్వులిచ్చింది. ఆమె స్థానంలో వికారాబాద్‌లో డీపీవోగా విధులు నిర్వరిస్తున్న చక్రవర్తి తరుణ్‌కుమార్‌ను జిల్లాకు బదిలీ చేసింది. చక్రవర్తి తరుణ్‌కుమార్ మరో రెండు రోజుల్లో డీపీవోగా బాధ్యతలు స్వీకరించే అవకాశముంది.

డీఎల్‌పీవోలు..

నిజామాబాద్ డీఎల్‌పీవో సార్థ నాగరాజును బాన్సువాడకు, బోధన్ డీఎల్‌పీవో మహ్మద్ గౌస్‌ను మెట్‌పల్లి, ఆర్మూర్ డీఎల్‌పీవో పాన్నూరు వెంకట శ్రీనివాస్‌ను కామారెడ్డికి బదిలీ చేశారు. వారి స్థానంలో బాన్సువాడ డీఎల్‌పీవో ముస్త్యాల శ్రీనివాస్ నిజామాబాద్‌కు, కామారెడ్డి డీఎల్‌పీవో వృద్దేమారి సాయిబాబా బోధన్‌కు, బైంసా డీఎల్‌పీవో అలపాట్ల శివకృష్ణ ఆర్మూర్‌కు రానున్నారు.

డీఆర్‌డీవో..

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి (డీఆర్‌డీవో) చందర్ నాయక్ బదిలీ అయ్యారు. జిల్లాలో దాదాపు మూడేళ్ల పాటు పని చేసిన ఆయనను కామారెడ్డి జెడ్పీ సీఈవోగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాకు డీఆర్‌డీవోగా కామారెడ్డిలో జెడ్పీ సీఈవోగా కొనసాగిన సాయాగౌడ్ బదిలీపై వస్తున్నారు.

జెడ్పీ సీఈవో..

నిజామాబాద్ రూరల్: జిల్లా పరిషత్ సీఈవో గోవింద్‌ను సోమవారం నిర్మల్ జిల్లాకు బదిలీ చేశారు. ఈ స్థానంలో ఉష నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి రానున్నారు. గోవింద్ జిల్లాలో దాదాపు తొమ్మిదేళ్లుగా విధులు నిర్వహించారు.

పోలీస్ శాఖలో..

ఖలీల్‌వాడి: అడిషనల్ డిప్యూటీ కమిషనర్ జయరాం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రమేష్ శ్రీ రామోజు అలియాస్ ఎస్ రమేష్ వీఈ నుంచి రానున్నారు. నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్ డీసీఆర్‌బీ డీఎస్పీగా మహబూబ్‌నగర్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో హైదరాబాద్‌లోని ఆసిఫ్‌నగర్ ఏసీపీగా పని చేస్తున్న రాజా వెంకట్ రెడ్డి నిజామాబాద్‌కు రానున్నారు.

జిల్లాలో కిడ్నాప్ గ్యాంగ్‌లు లేవు

- అనుమానితులపై దాడులు చేయొద్దు
- గాయత్రినగర్ ఘటనలో ఐదుగురిపై కేసు
- సీపీ కల్మేశ్వర్



మాట్లాడుతున్న సీపీ కల్మేశ్వర్

ఖలీల్‌వాడి: జిల్లాలో పిల్లలను కిడ్నాప్ చేసే గ్యాంగ్‌లు లేవని సీపీ కల్మేశ్వర్ అన్నారు. సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పిల్లలను కిడ్నాప్ చేసేవారు వచ్చారని సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మొద్దన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు నగరంలోని ఒకటో టౌన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్‌లో మాత్రమే కిడ్నాప్‌లు జరిగినట్లు చెప్పారు. ఈ అపహరణలకు వేర్వేరు కారణాలు ఉన్నట్లు తెలిపారు. వీటికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో ప్రచారం చేయడంతో అనుమానితులపై దాడులు జరుగుతున్నట్లు చెప్పారు. గ్రామాల్లో, పట్టణాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే దాడులు చేయకుండా, పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనుమానితులపై దాడులు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నగరంలోని గాయత్రినగర్ ఘటన లో ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పా రు. జిల్లాలో ఇప్పటివరకు 15 చోట్ల అనుమానితులపై దాడులు జరిగాయన్నారు. మూడు చోట్ల కేసులు నమోదు చేశామన్నారు. వదంతులను నమ్మవద్దని అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో వదంతులు వ్యాప్తి చేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

గల్ఫ్ ఏజెంట్లపై పీడీ యాక్ట్

జిల్లాలో కొందరు గల్ఫ్ ఏజెంట్లు ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలకు పాల్పడుతున్నట్లు సీపీ చెప్పారు. గల్ఫ్ ఏజెంట్లకు భవనాలు, షట్టర్‌లను కిరాయికి ఇవ్వొద్దని సూచించారు. గల్ఫ్ ఏజెంట్లపై జిల్లాలో పదేళ్లలో 50 కేసులు నమోదయ్యాయని వివరించారు. మోసాలకు పాల్పడు తున్న ఏజెంట్లపై పీడీ యాక్ట్ పెడతామన్నారు. జిల్లాలో లైసెన్స్ కలిగిన ఏజెంట్లు తక్కువ సంఖ్యలో ఉన్నారన్నారు. నకిలీ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దన్నారు. గంజాయితోపాటు ఇతర మత్తు పదార్థాలు అమ్మిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అర్ధరాత్రి వరకు షాపులు తెరిచి ఉంచితే కేసులు నమోదు చేస్తామన్నారు. దీంతోపాటు మున్సిపల్ లైసెన్స్‌ను రద్దు చేస్తామన్నారు.

ఫారెస్టులో ఫైర్‌లైన్స్



మల్లారం వద్ద ఫైర్‌లైన్స్‌ను ఏర్పాటు చేసి కొలతలు తీసుకుంటున్న అటవీ శాఖ అధికారులు

- అగ్ని ప్రమాదాల నివారణకు అటవీశాఖ చర్యలు
- ఐదు మీటర్ల వెడల్పుతో అగ్గి వరుసల ఏర్పాటు
- వన్యప్రాణులకూ తప్పనున్న ముప్పు

డొంకేశ్వర్(ఆర్మూర్): వేసవిలో అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు అటవీశాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. చెట్లతోపాటు వన్యప్రాణులు, పక్షులను కాపాడేందుకు 'ఫైర్ లైన్స్'ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేకంగా ఫైర్ వాచర్‌లను నియమించి వారితో అగ్గివరుసల(ఫైర్‌లైన్)ను పెట్టిస్తున్నారు. తద్వారా మంటలు అడవి అంతా వ్యాపించకుండా నివారిస్తున్నారు. జిల్లాలో అటవీ విస్తీర్ణం 2,14,659 ఎకరాలు కాగా, అడవులను సంరక్షించేందుకు నిజామాబాద్ నార్త్, నిజామాబాద్ సౌత్, వర్ని, ఆర్మూర్, కమ్మర్‌పల్లి, ఇందల్వాయి, సిరికొండ కలిపి మొత్తం ఏడు రేంజ్‌లు ఏర్పాటు చేశారు. రేంజ్, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు వారి పరిధిలోని అడవులను పర్యవేక్షిస్తున్నారు. అయితే, వేసవిలో రాలిపోయిన ఆకులకు నిప్పంటుకుని అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉంటుంది. బీడీ, సిగరెట్లు కాల్చిపారేయడం, అడవులకు ఆనుకొని ఉన్న వ్యవసాయభూముల్లో మంట పెట్టడం తదితర కారణాల వల్ల అడవుల్లో మంటలు వ్యాపించే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో అగ్ని ప్రమాదాలను నివారించేందుకు 'కాంపా' ఫండ్‌తో అడవుల చుట్టూ ఫైర్‌లైన్స్‌ను ప్రతి ఏటా ఏర్పాటు చేస్తున్నారు. అటవీప్రాంతం ప్రారంభం నుంచి ఐదు మీటర్ల మేర లోపలికి అగ్గి వరుసలను ఏర్పాటు చేస్తుండగా, ఇప్పటి వరకు మొత్తం 140 కిలో మీటర్ల మేర పూర్తయ్యింది. అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా ఫారెస్ట్ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

శాటిలైట్ ద్వారా వెంటనే సమాచారం

అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ వాచర్ల ద్వారా అగ్గి వరుసలు ఏర్పాటు చేస్తుండగా, ఒకవేళ అగ్ని ప్రమాదాలు జరిగితే వెంటనే అధికారులకు సమాచారం చేరేలా ప్రభుత్వం టెక్నాలజీని ఉపయోగిస్తోంది. టైగర్ కన్జర్వేషన్ ఆఫ్ అథారిటీ ఎస్ఎస్‌పీపీ అనే శాటిలైట్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఎక్కడ అగ్ని ప్రమాదాలు జరిగినా వెంటనే అధికారులకు సమాచారం వెళ్తుంది. దాని జీపీఎస్ ఆధారంగా వెంటనే ఫారెస్టు సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లి మంటలు ఆర్పివేస్తారు. మంటలు ఆర్పేందుకు బ్లోవర్ గన్‌లను వినియోగిస్తారు. అంతే కాకుండా అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఏ ప్రాంతాల్లో ఉన్నాయో కూడా ముందుగానే హెచ్చరికలు జారీ చేస్తారు. నిజామాబాద్ జిల్లాలో సిరికొండ, కమ్మర్‌పల్లి, వర్ని, ఇందల్వాయి, నిజామాబాద్ రేంజ్‌ల పరిధిలో ఎక్కువ అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయి.

సిబ్బందికి ఆదేశాలిచ్చాం



వేసవి నేపథ్యంలో అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించాం. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో ఫైర్‌లైన్స్‌ను ఏర్పాటు చేశారు. అడవులతోపాటు వన్యప్రాణులను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. కావాలని ఎవరైనా అడవులకు నిప్పు పెడితే చట్టప్రకారం చర్యలు తప్పవు.

– వికాస్ మీనా, జిల్లా అటవీ శాఖ అధికారి

తుదిదశకు ఈవీఎంల ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియ



ఈవీఎంలను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో గల ఈవీఎం గోడౌన్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ (ఎఫ్‌ఎల్‌సీ) ప్రక్రియ తుది దశకు చేరుకుంది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు క్రమం తప్పకుండా ఈవీఎం గోడౌన్‌ను సందర్శించి ప్రక్రియను పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం కలెక్టర్ ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియను పరిశీలించారు. వారం రోజులుగా ఈ ప్రక్రియ కొనసాగుతుండగా, ఇప్పటి వరకు ఎన్ని ఈవీఎంలను ప్రాథమిక పరిశీలన చేశారు.. ఇంకెన్నింటిని ఈవీఎంలు పరిశీలించాల్సి ఉంది.. తదితర వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. మొత్తం 2,904 బ్యాలెట్ యూనిట్లు, 2,014 కంట్రోల్ యూనిట్లు, 2,345 వీవీ ప్యాట్‌లకుగాను ఆదివారం నాటికి బీయులు 57 శాతం, సీయులు 74 శాతం, వీవీ ప్యాట్లు 58 శాతం ప్రాథమిక పరిశీలన పూర్తయిందని అధికారులు తెలిపారు. మరో రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎఫ్‌ఎల్‌సీ ముగిసిన వెంటనే గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల పనితీరు ప్రయోగాత్మక పరిశీలనకు వీలుగా ర్యాండమ్ పద్ధతిన మాక్‌పోల్ నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కృష్ణవేణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్, విజయేందర్ ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్



సుభాష్‌నగర్: అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ఎస్ కిరణ్ కుమార్ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆయన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వివిధ శాఖల అధికారులు అదనపు కలెక్టర్‌కు స్వాగతం పలికారు.



క్లుప్తంగా

మాక్లూర్ సొసైటీ ఇన్‌చార్జి చైర్మన్‌గా అశోక్



మాక్లూర్: మాక్లూర్ సొసైటీ ఇన్‌చార్జి చైర్మన్‌గా భూరోల్ల అశోక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గత నెలలో చైర్‌పర్సన్ గోపు లక్ష్మి వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేశారు. అనంతరం పలువురు డైరెక్టర్లు, నాయకులు ఇన్‌చార్జి చైర్మన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మూట కాశీనాథ్‌రావు, జిట్ట చిన్నగంగాధర్, గుండారం శేఖర్, మాజీ చైర్‌పర్సన్ గోపు లక్ష్మి, సొసైటీ కార్యదర్శి సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈడీ పరీక్షలు ప్రశాంతం

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో కొనసాగుతున్న ఎంఈడీ సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఎంఈడీ 1, 2, 3 వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్, 2వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు గిరిరాజ్ కళాశాలలో కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలకు 10 మందికి 10 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఎలాంటి మాల్ ప్రాక్టీస్ నమోదు కాలేదని తెలిపారు.

బకాయి బిల్లులను చెల్లించాలని వినతి



నాగిరెడ్డిపేట: జీపీల ద్వారా తమకు రావాల్సిన బకాయి బిల్లులను వెంటనే ఇప్పించాలని కోరుతూ మండలంలోని వివిధ గ్రామాల మాజీసర్పంచులు కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌కు వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు గ్రామపంచాయతీల ద్వారా బిల్లులు రావాల్సి ఉందన్నారు. వాటిని సకాలంలో ఇప్పించాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ప్రజావాణికి 78 ఫిర్యాదులు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా

సుభాష్‌నగర్: ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 78 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, డీఆర్డీవో చందర్, డీపీవో జయసుధకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. వినతులు పరిష్కారం కాకుంటే అందుకు గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూమి ఇప్పించాలని గగ్గుపల్లి గ్రామస్తుల డిమాండ్

ఆలూరు మండలం గగ్గుపల్లిలోని ప్రభుత్వ భూమి 148/2, 146 సర్వేనంబర్‌లో ఉన్న ఐదెకరాల భూమి ఇతరులకు పట్టా చేశారని, వెంటనే ఆ భూమిని గ్రామానికి ఇప్పించి న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి, ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఆ భూమి అక్రమ రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేయించి, గ్రామానికి ఇప్పిస్తానని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

బాల్కొండలో ప్రభుత్వ భూమి సర్వే



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

బాల్కొండ: మండల కేంద్రంలోని సర్వే నంబరు 1333లో ఉన్న ప్రభుత్వ భూమిని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ల్యాండ్ సర్వే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సర్వే బృందం అధికారులు సోమవారం సర్వే నిర్వహించారు. ఈ సర్వే పూర్తి కావడానికి కొంత సమయం పడుతుందని పూర్తి నివేదికను తహసీల్దార్‌కు అందిస్తామన్నారు. వారి వెంట తహసీల్దార్ శ్రీధర్, సర్వేయర్లు కిషన్ నాయక్, సూర్యప్రకాశ్, మమత, ఆర్ఐ రాఘవేందర్, వీడీసీ సభ్యులు తదితరులు ఉన్నారు.

'సాక్షి' కథనంతో..

మండల కేంద్రంలోని సర్వే నంబరు 1333లో ఉన్న ప్రభుత్వ భూమిపై సాక్షి దిన పత్రిక గత నెల 30న 'కబ్జా కోరాల్లో ప్రభుత్వ భూమి' అనే శీర్షికన వార్తా కథనం ప్రచురించింది. స్పందించిన అధికారులు ఈ నెల 1న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ల్యాండ్ సర్వే అధికారి కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని పరిశీలించారు. త్వరలోనే సర్వేయర్ల బృందంతో పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారన్నారు. దాని ప్రకారం సోమవారం సర్వే ప్రారంభించారు. సాక్షి కథనంతో అధికార యంత్రాంగం స్పందించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బదిలీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తున్న దశరథం రంగారెడ్డి జిల్లాకు, నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏడీగా ఉన్న కిషన్ రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో పాటు జిల్లాలో పని చేస్తున్న పలువురు ఎక్సైజ్ ఎస్సైలు బదిలీలు జరిగాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన వారు, మూడేళ్లు ఒకే వద్ద పనిచేసే అధికారులు, ఉద్యోగులను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. బదిలీ అయిన అధికారులు, ఉద్యోగుల వివరాలు ఇలా ఉన్నాయి..

పేరు	ప్రస్తుత పోస్టింగ్(ఎక్సైజ్ ఎస్సై)	బదిలీ అయిన స్థానం
సింధు	నిజామాబాద్	నిర్మల్
మంజు	బోధన్	చెన్నూర్
మమత	కామారెడ్డి	నిజామాబాద్
మహమ్మద్ జలాలొద్దీన్	ఎల్లారెడ్డి	బోధన్
నర్సింహచారి	ఆసిఫాబాద్	నిజామాబాద్
ప్రభాకర్	పెద్దపల్లి	సాలూరా
సమీనుల్లాఖాన్	ఇల్లెందు	యంచ

రేపు సర్టిఫికెట్ల పరిశీలన

నిజామాబాద్‌అర్బన్: డైట్ కళాశాలలో ప్రవేశాలకు సంబంధించి బుధవారం సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగారంలోని డైట్‌లో డీఎడ్, డీపీఎస్‌సీ కోర్సుల ప్రవేశాలకు సంబంధించి ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. గతంలో సర్టిఫికెట్ పరిశీలనకు హాజరు కాని వారు మాత్రమే పాల్గొనాలన్నారు. ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు విద్యార్థులు తమ అపాయింట్‌మెంట్ లెటర్ డౌన్‌లోడ్ చేసుకొని ఒరిజినల్ సర్టిఫికెట్లతో సీటు పొందిన కళాశాలలో ఈనెల 28న రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో బంగారం పతకం



నిజామాబాద్‌నాగారం: జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో భాగంగా ట్రిపుల్ జంప్‌లో జిల్లాకు చెందిన పీఈటీ ఇందిరా బంగారు పతకం సాధించారు. ఈ నెల 8 నుంచి 11వరకు గచ్చిబౌలి స్టేడియంలో జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ పోటీలు నిర్వహించారు. నగరంలోని దుబ్బ ప్రభుత్వ పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్న ఇందిరా ట్రిపుల్‌జంప్‌లో బంగారు పతకం, త్రి అవైడ్ హార్డిల్స్‌లో రజత పతకం సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం గంగయ్య, ఉపాధ్యాయులు ఇందిరాకు అభినందనలు తెలిపారు.

పాలమూరు ప్రాజెక్టులను పట్టించుకోలేదు



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

వేల్పూర్: గత ప్రభుత్వ పాలనలో పాలమూరు ప్రాజెక్టులను మాజీ సీఎం కేసీఆర్ పట్టించుకోలేదని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకెట అన్వేశ్‌రెడ్డి ఆరోపించారు. కృష్ణా జలాలపై నల్గొండలో బీఆర్ఎస్ తలపెట్టిన బహిరంగ సభను నిరసిస్తూ సోమవారం మండల కేంద్రంలో మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. 2015లో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన కేసీఆర్ అధికారంలో ఉన్న పదేళ్లలో 40 శాతం పనులు కూడా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు సాగు, తాగునీరు ఇవ్వలేని కేసీఆర్ ఏ ముఖం పెట్టుకొని నల్గొండకు వెళ్తారని ప్రశ్నించారు. కృష్ణానది నుంచి సంగమేశ్వర ప్రాజెక్టు ద్వారా ప్రతిరోజు 3 టీఎంసీల నీటిని ఆంధ్రప్రదేశ్ తీసుకెళ్తుంటే గత ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సారెడ్డి, నాయకులు అనిల్‌గౌడ్, దామోదర్‌గౌడ్, స్వరూప, నరేంద్ర, భగవాన్ దాస్, రమణ, రాము, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఆర్డీఏ ఏపీడీ మృతికి సంతాపం



సుభాష్‌నగర్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ సంజీవ్‌కుమార్ మృతిపై జిల్లా అధికార యంత్రాంగం సంతాపం వ్యక్తం చేసింది. ఆయన మృతికి సంతాపం తెలుపుతూ సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏపీడీ సంజీవ్ కుమార్ చిత్రపటానికి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, డీఆర్డీవో చందర్, ఏవో రమణ, డీపీవో జయసుధ, ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సంజీవ్ కుమార్ అందించిన సేవలను కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.

ఎండీ సాగిరుద్దీన్‌కు డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెయూ మాస్ కమ్యూనికేషన్ విభాగం పరిశోధక విద్యార్థి మహమ్మద్ సాగిరుద్దీన్ డాక్టరేట్ సాధించారు. ఇఫ్లూ అసోసియేట్ ప్రొఫెసర్ రాజారాం పర్యవేక్షణలో 'రోల్ ఆఫ్ ఉర్దూ న్యూస్ పేపర్ క్రియేటింగ్ అవేర్నెస్ ఆన్ స్టేట్ గవర్నమెంట్ వెల్ఫేర్ స్కీమ్స్ అమంగ్ ముస్లిం మైనారిటీస్ - ఏ కేస్ స్టడీ ఇన్ హైదరాబాద్ సిటీ ఇన్ తెలంగాణ స్టేట్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. అనంతరం సాగిరుద్దీన్‌ను సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, మాస్ కమ్యూనికేషన్ విభాగాధిపతి పి.శాంతా బాయి, అధ్యాపకులు టి.మోహన్, శ్రీనివాస్‌గౌడ్, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ నారాయణ

తెయూ(డిచ్‌పల్లి): వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నారాయణ సూచించారు. 35వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా సోమవారం తెయూలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆరతి అధ్యక్షతన రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే 80 శాతం ప్రమాదాలు జరగకుండా ఉంటాయన్నారు. భారతదేశంలో సుమారు 140 కోట్ల జనాభా ఉండగా 40 కోట్ల వాహనదారులు ఉన్నారని తెలిపారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లో శిక్షణతో పాటు లైసెన్సు కలిగి ఉండాలని, వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో నేషనల్ హైవే 44 రూట్ ఆఫీసర్ వీర్రాజు, ఇంటిగ్రేటెడ్ రోడ్ ఆక్సిడెంట్ డాటా బేస్ ఆఫీసర్ వర్ష నిహంత్, ట్రాఫిక్ రిజర్వు ఇన్‌స్పెక్టర్ సతీశ్, అధ్యాపకులు సంపత్ కుమార్, ఎ పున్నయ్య, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భగీరథ కోసం విద్యుత్ చౌర్యం

- వ్యవసాయ కరెంట్‌ను వాడుతున్న వైనం
- తమకు తెలియదంటున్న విద్యుత్ అధికారులు



పొలాల్లో ఏర్పాటు చేసిన వైర్లు

ఎడపల్లి(బోధన్): మిషన్ భగీరథ ద్వారా తాగు నీటిని సరఫరా చేసేందుకు సంబంధిత అధికారులు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారు. ప్రభుత్వ రంగంలో కొనసాగుతున్న ఓ సంస్థకు మరో సంస్థ నష్టాన్ని కలగజేస్తోంది. భగీరథ నీటిని సరఫరా చేసేందుకు మండలంలోని కుర్నాపల్లి సమీపంలో దర్గా వద్ద ట్యాంకును ఏర్పాటు చేశారు. అయితే ఈ ప్రాంతం నుంచి ఎగువకు నీరు వెళ్లడం లేదు. హైప్రెషర్ తో పైప్‌లైన్‌కు నీటిని పంపించేందుకు మోటార్‌కు 25 కేవీ విద్యుత్ కనెక్షన్ అవసరం. మిషన్ భగీరథ హైప్రెషర్ మోటార్‌కు విద్యుత్ కనెక్షన్ కోసం సంబంధిత అధికారులు విద్యుత్‌శాఖకు దరఖాస్తు చేశారు. కనెక్షన్ రుసుము, డిపాజిట్ కోసం, 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్, లైన్‌కు కలిపి రూ.లక్ష వరకు ఖర్చు అవుతుందని విద్యుత్‌శాఖ అధికారులు ఎస్టిమేషన్ ఇచ్చారు. ఖర్చుకు వెనుకాడిన భగీరథ అధికారులు.. పంపింగ్ చేసి ఎగువ ప్రాంతానికి నీటిని సరఫరా చేసేందుకు ఐరన్(ఇనుప) ట్యాంక్‌ను ఏర్పాటు చేసి అందులో 7.5 హెచ్‌పీ మోటారు బిగించారు. పక్కనే ఉన్న వ్యవసాయ భూమికి సరఫరా అవుతున్న ఉచిత్ విద్యుత్ కనెక్షన్‌ను వాడుకొని నీటి సరఫరా చేస్తున్నారు. కల్వర్టు కిందినుంచి పంటపొలాల్లోకి వైర్లు అమర్చి తొమ్మిది నెలలుగా ఉచిత విద్యుత్‌ను భగీరథకు వాడుకుంటున్నారు.

ఎస్టిమేషన్ ఇచ్చాం

మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం కుర్నాపల్లి సమీపంలోని దర్గావద్ద ట్యాంకు ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ కోసం అధికారులు దరఖాస్తు చేశారు. మేము ఎస్టిమేషన్ వేసి ఇచ్చినా వారు రాలేదు. వ్యవసాయ విద్యుత్‌ను వాడుకుంటున్న విషయం తెలియదు. ఒకవేళ వ్యవసాయ విద్యుత్‌ను వాడుతున్నట్లు తేలితే కేసు నమోదు చేస్తాం.

– నాగేశ్వర్‌రెడ్డి, విద్యుత్‌శాఖ ఏఈ

క్రైం కార్నర్

బాన్సువాడలో బైక్ చోరీ

బాన్సువాడ: పట్టణంలోని బండగల్లీలో ఆదివారం రాత్రి బైక్ చోరీకి గురైంది. కాలనీకి చెందిన పింకిరాజు తన బైక్‌ను రాత్రి ఇంటికి ఎదుట నిలిపి నిద్రించాడు. ఉదయం బైక్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రాజు తెలిపాడు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఇందల్వాయి: మండలంలోని అన్సాన్‌పల్లి వద్ద ఆదివారం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో గాయపడ్డ నందిపేట్ మండలం తల్వేదకు చెందిన ఎర్నాల లక్ష్మణ్(26) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మనోజ్ సోమవారం తెలిపారు. ఇటీవల గల్ఫ్ నుంచి వచ్చిన లక్ష్మణ్ ధర్పల్లిలోని తన స్నేహితుడిని కలిసేందుకు ఆర్మూర్‌కి చెందిన మరో స్నేహితుడితో కలిసి ధర్పల్లికి వచ్చి తిరిగి వెళ్తుండగా ప్రమాదం జరిగిందన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రెంజల్: మండలంలోని నీలా గ్రామం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ సోమవారం తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి పట్టుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మోపాల్‌లో డ్రంకన్‌డ్రైవ్ కేసులు

మోపాల్: మోపాల్ పీఎస్ పరిధిలో సోమవారం రెండు డ్రంకన్ డ్రైవ్, మూడు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న కేసులు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. వారి వాహనాలు స్వాధీనం చేసుకుని, వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చనున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపినా.. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

చెట్టును ఢీకొన్న బైక్

- ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు



భీమ్‌గల్: ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని మెండోరా గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై హరిబాబు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఇట్టంపేట రాజన్న(49), తెలిసిన వ్యక్తి సాజిద్‌బేగ్ రాజన్న పొలానికి బైక్‌పై వెళ్తుండగా మెండోరా శివారులోని మల్లన్న గుడి ప్రాంతంలో ఉన్న చెట్టును ఢీకొన్నారు. ఈ ఘటనలో సాజిద్, రాజన్నకు తీవ్ర గాయాలు కాగా రాజన్న అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు సాజిద్‌ను జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు వినీత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకరికి నాలుగు రోజుల జైలు శిక్ష

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్‌లో ఇందల్వాయి మండలంలోని వెంగళ్‌పాడ్ గ్రామానికి చెందిన బానోతు రవికి నాలుగు రోజుల జైలు శిక్షను సెకండ్ క్లాస్ జడ్జి మహమ్మద్ ఖదీర్ విధించినట్లు ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ సోమవారం తెలిపారు. జిల్లాలో 26 మందిని కోర్టులో హాజరుపర్చగా రూ. 29,100 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

పాఠశాల కరస్పాండెంట్ అదృశ్యం

భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్ ఒకరు అదృశ్యమైనట్లు ఎస్సై సాయికుమార్ సోమవారం తెలిపారు. మండల కేంద్రంలోని విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ విజయభాస్కర్‌రెడ్డితో పాఠశాల భాగస్వాములు డబ్బుల విషయంలో ఆదివారం రాత్రి గొడవపడ్డారు. దీంతో భాస్కర్‌రెడ్డి రాత్రి నుంచి ఇంటికి రాలేదని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

- కాళ్లు, చేతులు కట్టేసి చెరువులో పడేసినట్లు అనుమానం
- విచారణ చేపట్టిన ఏసీపీ



నరేశ్ (ఫైల్)

నవీపేట: మండలంలోని మోకన్‌పల్లికి చెందిన రొడ్డ నరేశ్(30) సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు.. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నరేశ్ అదే గ్రామానికి చెందిన దివ్యను ఎనిమిదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి విఘ్నేష్, రుత్విక్ ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నెల 10న రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ భార్య దివ్యను నరేశ్ జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స చేయించి ఇంటికి తీసుకొచ్చాడు. అదే రోజు రాత్రి ఇంటి నుంచి వెళ్లిన నరేశ్ తిరిగి రాలేదు. ఈ నెల 11న కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఇది లా ఉండగా సోమవారం ఉదయం నరేశ్ గ్రామ శివారులోని చెరువులో శవమై కనిపించాడు. మృతుడి కాళ్లు, చేతులను తాళ్లతో కట్టేసి ఉండడంతో అనుమానాస్పద కేసుగా దర్యాప్తు చేపట్టారు.

ఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ

మోకన్‌పల్లి చెరువులో అనుమానాస్పదంగా మృతి చెందిన నరేశ్ మృతదేహాన్ని నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్, నార్త్ రూరల్ ఇన్‌చార్జి సీఐ నరేశ్ కుమార్, ఎస్సై యాదగిరిగౌడ్ పరిశీలించారు. కాళ్లు చేతులు తాళ్లతో కట్టేసి ఉండడంతో పలువురిని విచారించారు. తల్లి అబ్బవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు..

సదాశివనగర్: అడ్లూర్ఎల్లారెడ్డి శివారులోని సర్వీస్ రోడ్డుపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై రాజు సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా నిజాంపేట్‌కు చెందిన బాబు(38) మూడు నెలల క్రితం గాయత్రి షుగర్ ఫ్యాక్టరీలో పనిచేసేందుకు భార్యతో వచ్చి మర్కల్ శివారులోని గుడిసెలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం రాత్రి బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా అడ్లూర్ ఎల్లారెడ్డి శివారులోని సర్వీస్ రోడ్డు ప్రాంతంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడి భార్య బూలిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో కిందపడి ఒకరు..

బోధన్‌రూరల్: మండలంలోని సిద్దాపూర్‌లో నీలకంఠ (45) అనే వ్యక్తి తన ఇంటి సమీపంలో మద్యం మత్తులో కిందపడి మృతిచెందినట్లు బోధన్ రూరల్ పోలీసులు సోమవారం తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఆలూర్‌లో అనుమానితుల అరెస్ట్

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండల కేంద్రంలో సోమవారం అనుమానంగా తిరుగుతున్న నలుగురు మహిళలు, ఓ వ్యక్తిని స్థానికులు పట్టుకున్నారు. పిల్లలను కిడ్నాప్ చేసే ముఠాగా భావించి వారిని పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వారిని పీఎస్‌కు తరలించి విచారణ చేపట్టారు. విచారణలో ప్రస్తుతం వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కృష్ణ జిల్లా చెందిన వారని తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

నస్రుల్లాబాద్: మండలంలోని బొప్పాస్‌పల్లి పరిధిలో పేకాట స్థావరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. దాడిలో 13 మందిని అరెస్టు చేసి వారి నుంచి 14 ఫోన్‌లు, 9బైక్‌లు, రూ.38,240 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లావణ్య తెలిపారు. పక్కా సమాచారం మేరకు ప్రత్యేక బృందంతో కలిసి దాడిచేసినట్లు తెలిపారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

రెంజల్(బోధన్): అప్పుల బాధ తట్టుకోలేక జీవితంపై విరక్తి చెంది ఒకరు కందకుర్తిలోని గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ పట్టణం రాకాసిపేటకు చెందిన సయ్యద్ కరీముల్లా (33) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. వ్యాపారంలో అప్పులు కావడంతో కొంత కాలంగా మనోవేదనకు గురయ్యేవాడని కుటుంబీకులు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు.


కందకుర్తిలోని గోదావరి నదిలో ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం అందడంతో ఘటన స్థలానికి వెళ్లగా బైక్, చెప్పులు లభించాయన్నారు. మృతదేహం కోసం గాలించగా ఆదివారం ఉదయం లభ్యమైందన్నారు. మృతుడి భార్య సమ్రీన్ సుల్తానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



భిక్కనూరు: మండల కేంద్రంలోని చర్చి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. దోమకొండ మండలంలోని అంచనూరుకు చెందిన సిద్ధరాములు–తిరుమల్లమ్మలు వ్యక్తిగత పనినిమిత్తం మెదక్ జిల్లా రామాయంపేటకు వెళ్లి వస్తుండగా మండల సమీపంలో హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న టాటా ఏసీ వాహనం వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో దంపతులకు తీవ్రగాయాలయాలు కాగా స్థానికులు అంబులెన్స్‌లో కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాజశేఖర్‌రాజు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్‌రాజు తెలిపారు. నగరంలోని ఐదో టౌన్ పీఎస్ పరిధిలోని భారతిరాణి కాలనీలో ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. దాడుల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తేలడంతో కాలనీకి చెందిన షేక్ ముజీబ్ అహ్మద్, షేక్ నజీబ్ అహ్మద్‌లను అదుపులోకి తీసుకోగా వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ. 46,700 నగదును స్వాధీనం చేసు కున్నట్లు తెలిపారు. ఈ బెట్టింగ్ సభ్యులైన మరో ముగ్గురు రాజస్థాన్‌కు చెందిన యాంచ, నగరంలోని ఆటోనగర్‌కు చెందిన షేక్ శైబజ్, బాబన్‌సాహాబ్‌పహాడ్‌కు చెందిన అఫ్జల్, సారంగపూర్‌కు చెందిన రాహుల్, అహ్మదీ మార్కెట్‌కు చెందిన మున్నాఫ్ అహ్మద్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. నిందితులు తెలంగాణ, మహారాష్ట్రలో భారీ ఎత్తున అమాయక ప్రజలను మోసగించి, వారిని ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ఆడేలా చేసి, వారి నుంచి డబ్బులను దోచుకుంటున్నట్లు తెలిపారు. నగరంలో సుమారు 200 మంది వీరి చేతిలో మోసపోయినట్లు గుర్తించినట్లు చెప్పారు. వీరు మహారాష్ట్ర, రాజస్థాన్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకుల ద్వారా ఐడీలు ఇప్పించి తద్వారా బెట్టింగ్ చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. విచారణలో ఇంకా పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐలు అంజయ్య, అజయ్‌బాబు, ఎస్సై అప్పారావు, సిబ్బంది ఉన్నారు.